క్లుప్తంగా

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్ల పూర్తి

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరు గాంచిన అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరిగే ముక్కోటి ఏకాదశి పర్వదిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేలాది మంది భక్తులు ఆలయ ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకునే ఏర్పాట్లను పట్టణ సీఐ పి.వీరబాబు గురువారం సాయంత్రం పరిశీలించారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జంగా అబ్బాయి వెంకన్న, ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది ముక్కోటి ఏకాదశికి చేసిన ఏర్పాట్ల గురించి సీఐకి వివరించారు. భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్లు, బారికేడ్లను సీఐ స్వయంగా పరిశీలించారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

తాళ్లరేవు: పుత్ర వియోగంతో బాధపడుతున్న నీలపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు పలివెల కొండ కుటుంబ సభ్యులను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు గురువారం పరామర్శించారు. కొండ కుమారుడు పలివెల శ్రీనివాస్(32) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పొన్నాడతో పాటు పార్టీ మండలాధ్యక్షుడు గోవింద కుమార్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జగదీశ్వరరావు, వ్యవసాయశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ సూర్యనారాయణ రాజు, మహిళా నాయకురాలు శాంతకుమారి, రెడ్డి నాగేశ్వరరావు, పేర్ని ఆదినారాయణమూర్తి, రెడ్డి సతీష్, రేవు నాగేశ్వరరావు, పలివెల రాజు, మోకా మధుబాబు, సీలి రాజు, పువ్వల కృష్ణమూర్తి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మందుబాబుల వీరంగం

కాట్రేనికోన: మండల కేంద్రం కాట్రేనికోన సెంటరులోని మద్యం షాపులో మద్యం సేవించిన మందు బాబులు రోడ్లపై పడిపోతున్నారు. రాజానగరానికి చెందిన ఓలేటి నాగరాజుతో పాటు మరో వ్యక్తి పూటుగా మద్యం సేవించి ఒకరినొకరు పట్టుకొని షాపువద్ద పడుకొని ఉన్నారు. కొంత సేపటికి మద్యం మత్తులో సీసీ రోడ్డుపై ఓలేటి నాగరాజు పడిపోవడంతో తలకు బలమైన గాయం కావడంతో రక్త స్రావం అయ్యింది. దీంతో 108 అంబులెన్సులో నాగరాజును ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మహిపాల చెరువు పల్లంకుర్రు ప్రధాన రహదారిని ఆనుకుని కాట్రేనికోన సెంటరులో మద్యం షాపు ఉండటంతో మద్యం సేవించిన మందుబాబులు షాపుల వద్ద, రోడ్ల పైన పడుకొని స్థానికులను ఇబ్బందులు పెడుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరం కండి

తాళ్లరేవు: సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ కోరారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మత్స్యకార గ్రామాలైన చినవలసల, పెదవలసల, గాడిమొగతోపాటు పటవల, కోరంగి గ్రామాలలో ఆయన సిబ్బందితో కలిసి ఆటోలో మైక్ ద్వారా ప్రచారం చేశారు. కోడి పందేలు, గుండాట, పేకాట వంటివి నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా జూద క్రీడలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థుల్లో ఆలోచనలు అభివృద్ధి చెందాలి

అమలాపురం టౌన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆలోచనలు అభివృద్ధి చెందాలని డీఈవో షేక్ సలీమ్ బాషా సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో మాట్లాడారు. దీనిలో భాగంగా పాఠశాల స్థాయి నోడల్ టీచర్లకు నిర్వహించిన ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని డీఈవో పర్యవేక్షించారు. ఈఎండీపీ జిల్లా నోడల్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జోనల్ మేనేజర్ వై.నవ్య, సమగ్ర శిక్ష అకడమిక్ మోనిటరింగ్ అధికారి పి.రాంబాబులు ప్రసంగించారు. సమావేశంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల అందజేత

తాళ్లరేవు: సంక్రాంతి పండగ సందర్భంగా తాళ్లరేవు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి ఆధ్వర్యంలో గురువారం నూతన వస్త్రాలను అందజేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేస్తున్న కార్మికులను గౌరవించడం అందరి బాధ్యతని పంచాయతీ కార్యదర్శి నున్న శంకర నారాయణ అన్నారు. రెడ్డి రెడ్డిబాబు, విత్తనాల రామకృష్ణ, సచివాలయ కార్యదర్శి వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగుల వయో పరిమితిని పెంచాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా సుమారు 10వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నిరుద్యోగుల వయో పరిమితిని 40 ఏళ్లకు పెంచాలని కోరుతూ శుక్రవారం సివిల్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి ఎల్జీ కె కైలాషనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ,ఎస్టీ, ఓబీసీల బ్యాక్ లాగ్ పోస్టులను ప్రతి 6 నెలలకు ఓసారి భర్తీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

శివారు గ్రామాల గొంతెండుతోంది..!

- కుళాయిల నుంచి నీరు రాక స్థానికుల ఇక్కట్లు
- నీటి చోరీకి పాల్పడుతున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు
- గుక్కెడు నీరు అందక రోడ్డెక్కిన మహిళలు


కాట్రేనికోనలోని గొల్లల వీధిలో మంచి నీటి కుళాయిల నుంచి నీరు రాకపోవడంతో బిందెలతో రోడ్డెక్కిన మహిళలు (ఫైల్)


గొల్లల వీధిలో కుళాయి నుంచి సన్నని ధారతో వస్తున్న తాగునీరు

కాట్రేనికోన: మండల కేంద్రం కాట్రేనికోన మీదుగా శివారు ప్రాంతాలకు సరఫరా చేసే మంచి నీటి పైపులైను వెంబడి వందలాది విద్యుత్ మోటార్లు వేయడంతో శివారు ప్రాంతాలకు గుక్కెడు మంచి నీరు అందడం లేదు. కాట్రేనికోన మండలం కందికుప్ప, నడవపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు చెరువుల నుంచి రక్షిత మంచి నీటిని శివారు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. పల్లంకుర్రు ప్రాజెక్టు పరిధిలోని పల్లంకుర్రు, బ్రహ్మసమేథ్యం పరిధిలోని బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, పోర, దొంతికుర్రు, నడవపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు పరిధిలోని నడవపల్లి, గెద్దనపల్లి, కొప్పిగుంట, పోరపేట, బక్కివారి పేట, కాట్రేనికోన, వేట్లపాలెం, సత్తమ్మచెట్టు, రాజానగరం, నాగపట్టణం, గచ్చకాయలపోర, చిర్రయానం గ్రామాలకు రక్షిత మంచి నీటిని సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు కందికుప్ప, పల్లం పంచాయతీ చెరువుల నుంచి కందికుప్ప, పల్లం గ్రామాలకు రక్షిత నీటిని అందిస్తున్నారు.

విద్యుత్ మోటార్లతో చోరీ

నడవపల్లి ప్రాజెక్టు చెరువు నుంచి చిర్రయానం వెళ్లే పైపులైను వెంబడి కాట్రేనికోన టౌన్, కాట్రేనికోన–వేట్లపాలెం రోడ్డులో పైపులైను ట్యాప్‌లకు విద్యుత్ మోటార్లు అమర్చి మంచి నీటిని యథేచ్ఛగా 24 గంటలూ తోడేస్తున్నారు. కాట్రేనికోన ఓవర్‌హెడ్ ట్యాంకుకు సరఫరా చేస్తున్న సమయంలోనూ బడా బాబులు మోటర్లు వేసి మంచి నీటిని తోడేయడంతో శివారు ప్రాంతాలకు చుక్క నీరు రావడం లేదు. కాట్రేనికోన టౌన్‌లోనే సుమారు 350కి పైగా విద్యుత్ మోటార్లు పైపులైను ట్యాప్‌లకు అమర్చి ఉన్నాయి. ట్యాప్‌లకు అక్రమంగా విద్యుత్ మోటర్లు వేసి మంచి నీటిని తోడేయడంతోనే శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదనే విషయం ప్రజా ప్రతినిధులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలిసిన నగ్నసత్యం. పార్టీ ఏదైనా రాజకీయ నాయకుల అండదండలతో పైపులైన్‌పై ఉన్న ట్యాప్‌లకు అక్రమంగా విద్యుత్ మోటార్లు అమర్చి ఉన్నా వాటిని తొలగించేందుకు సంబంధిత అధికారులు ముందుకు రావడం లేదు. పైప్‌లైన్‌పై ట్యాప్‌లను వేసి విద్యుత్ మోటర్లు అమర్చడంతో శివారు గ్రామాలకు చెందిన ట్యాంకులకు నీరు ఎక్కడం లేదు. దీనితో కాట్రేనికోన, వేట్లపాలెం, సత్తమ్మచెట్టు, రాజానగరం, నాగపట్టణం, గచ్చకాయలపోర, చిర్ర యానం గ్రామాలకు సక్రమంగా మంచి నీరు సరఫరా కావటం లేదు.

ట్యాప్‌లు వేసినా ఫలితం శూన్యం

ఇంటింటికీ మంచి నీటి పైప్‌లైన్ పనులు చేపట్టి కుళాయిలు వేసినా రెండు రోజులకు ఒకసారి ఐదు బిందెలు కూడా రావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాలు వేట్లపాలెం, నాగపట్టణం, మర్రి చెట్టు కాలనీ, చిర్రయానం, పల్లం, కొత్తపాలెం, మొల్లేటి మొగ, పోర, దొంతికుర్రు, గెద్దనపల్లి తదితర ప్రాంతాలలో రక్షిత మంచి నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. మంచి నీటి సమస్య కొన్ని గ్రామాలలో అయితే వేసవిని తలపిస్తుంది.

బిందె నీటికీ దిక్కు లేదు

కాట్రేనికోన పరిధిలోని గొల్లలవీధిలో ఇంటింటికీ మంచి నీటి కుళాయిలు వేయించినప్పటి నుంచి ట్యాపుల నుంచి సక్రమంగా మంచి నీరు రావడం లేదని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులకు ఒకసారి కుళాయి వస్తోందని బిందె నీరు కూడా రావడం లేదన్నారు. పైపులైను వెంబడి కుళాయిలకు అక్రమ విద్యుత్ మోటర్లు వేయడంతో గుక్కెడు నీరు కూడా రావడం లేదని రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావుకు మొరపెట్టుకున్నారు. గత ఏడాది నుంచి తమకు మంచి నీటి సమస్య ఉందని వారం రోజుల నుంచి సమస్య మరింత జఠిలంగా మారిందన్నారు. మంచినీరు అందివ్వాలని కుళాయిల వద్దనే రోడ్డుపై బిందెలతో మహిళలు ఆందోళన చేశారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ మోటార్లు తొలగించి మంచి నీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక మహిళలు బేబి, కుమారి, లక్ష్మి, సత్యవతితో పాటు మరి కొందరు కోరుతున్నారు.

> **అధికారుల దృష్టికి తీసుకెళతాం**
>
> అక్రమ విద్యుత్ మోటార్లతో తాగునీటి దుర్వినియోగం జరుగుతున్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. శివారు గ్రామాలకు నీటి సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను పరిష్కరించడంపై దృష్టి సారిస్తాం.
>
> జె.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, కాట్రేనికోన.

ముగిసిన క్రీడోత్సవం పోటీలు


ముమ్మిడివరంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు


క్రీడాకారులతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, ఉపాధ్యాయులు

ముమ్మిడివరం: మండలంలో మూడు రోజులుగా కొనసాగుతున్న కోనసీమ క్రీడోత్సవం గురువారంతో ముగిసింది. స్థానిక జెడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలలు, ఎంజీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన ఫైనల్ పోటీలలో వివిధ విభాగాలలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. విజేతలకు ఎంపీడీఓ టి.వెంకటాచార్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శాంతిలక్ష్మి, ఎంఈఓ ఆర్ ఉదయ్ భాస్కర్, మండల కోఆర్డినేటర్ పి.రాంబాబు, పీడీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో క్రీడోత్సవంలో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీల్లో రెండో రోజు బుధవారం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. రెండో రోజు పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీదేవి, గణేష్, మూరి, ప్రసాద్, బుజ్జి, శ్రీనివాస్, చంటి, సందీప్‌లు పోటీలను పర్యవేక్షించారు.

పరీక్షలంటే పండగలా భావించాలి


కామనగరువులో విద్యార్థులతో జేసీ నిషాంతి

జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: విద్యార్థులు పరీక్షల పట్ల భయాందోళనను వీడి ఆత్మ విశ్వాసంతో సిద్ధం కావాలని జేసీ టి.నిషాంతి సూచించారు. గురువారం మండల పరిధిలోని కామనగరువు అప్పన్నపేట, జనపల్లి పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ కృషి, పట్టుదల తోడైతే విజయం సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

అల్లవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఊరూరా బెల్ట్ షాపులు పుట్టుకొస్తుంటే ఎక్సైజ్ శాఖ ఉందా అనే అనుమానం వ్యక్తమవుతోందని సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. ఊరికి పది బెల్ట్ షాపులు ఏర్పాటు చేయటం ఏమిటని సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు ప్రశ్నించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సర్వశిక్షా భియాన్ ద్వారా పాఠశాలలకు ప్రహరీలు నిర్మిస్తే నేటికి బిల్లులు చెల్లించలేదని ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, గుబ్బల బాబ్జి ప్రశ్నించారు. ప్రధాన డ్రెయిన్లల్లో పూడిక తీత పనులకు నాబార్డుకు ప్రతిపాదనలు చేశామని, నిధులు మంజూరైతే పనులు చేపడతామని ఏఈ సునీతాదేవి తెలిపారు. లోటల్టేజీ నివారణకు 13 ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రపోజల్ చేశామని ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. డ్వాక్రా వ్యవస్థలో యానిమేటర్లు అవినీతికి పాల్పడుతుంటే ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలని సర్పంచ్‌లు రాకాపు విజయలక్ష్మి, రొక్కాల విజయలక్ష్మి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. పంచాయతీ రాజ్ ఏఈ ఫకీర్ పల్లె పండగ కార్యక్రమం ద్వారా రూ. 2.25 కోట్ల నిధులతో 24 సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేస్తున్నామని తెలిపారు. దీనిపై పలువురు ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా ఈ పనులు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. మండల ప్రత్యేకాధికారి కె.మూర్తి, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వద్ది గంగ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు, తహసీల్దార్ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లాడి వ్యాఖ్యలు అభ్యంతరకరం

- ఆరోపణలపై సీబీఐ విచారణకు సిద్ధం
- ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: తాను నియోజకవర్గానికి శాసన సభ్యుడినని మరిచి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి తనపై ప్రజా ఉత్సవాల బహిరంగ వేదికపై ఇష్టానుసారం ఆరోపణలు చేయడం అభ్యంతరకరమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. అవసరమైతే దీనిపై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి సంస్థల చేత విచారణకు సైతం తాను సిద్ధమన్నారు . గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హెచ్ ఆర్ స్క్వేర్ క్లీనింగ్ సంస్థ ద్వారా తాను లక్షలాది రూపాయలు లబ్ధి పొందుతున్నానని మల్లాడి కృష్ణారావు చేసిన ఆరోపణలు నిరాధారమని అలాంటి వ్యాఖ్యలు ఆయన ఉపసంహరించుకోవాలని కోరారు. తనపై నమ్మకంతో 28 ఏళ్ల చిన్న వయస్సులోనే తనను యానాం ప్రజలు శాసనసభ్యుడిగా సీఎం రంగసామిపై గెలిపించారని అన్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని కేవలం మల్లాడిని పొగిడేందుకే ప్రజా ఉత్సవాలకు ఉపయోగించారన్నారు. అహంకారంతో ఉన్న మల్లాడి కృష్ణారావుకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారన్నారు. మత్స్యకారుల నష్టపరిహారం సొమ్ము పక్కదోవ పట్టిందనే వాస్తవం అందరికీ తెలుసునన్నారు.

రహదారి భద్రతా ప్రమాణాలపై దృష్టి సారించాలి

కలెక్టర్ మహేష్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జాతీయ రహదారులను నిర్మిస్తున్న సంబంధిత ఏజెన్సీలు రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించడంపై ప్రైవేట్ ఏజెన్సీతో ఆడిట్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారులపై చాలా ప్రదేశాలలో సైన్ బోర్డులు కనిపించడం లేదని వాటిని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమైన కూడళ్లలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా అనుభవం గల రవాణాశాఖ ఇంజినీర్లతో సర్వే నిర్వహించి ప్రమాదాలు జరగడానికి కారణాలను అన్వేషించాలన్నారు. అమలాపురంలో ప్రత్యామ్నాయంగా వంతెనలు నిర్మించేందుకు సమగ్ర ప్రాజెక్టు నివేదికను రూపొందించి సాయిల్ ఎనాలసిస్ చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ ప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాము, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, డీఎం హెచ్ఓ దుర్గారావు దొర, డీసీహెచ్ఎస్ కార్తీక్, పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంబరాన్ని తాకిన సంక్రాంతి సంబరాలు

- సంప్రదాయ వంటలను ప్రదర్శించిన విద్యార్థినులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- వేడుకను వీక్షించిన డీఈవో బాషా

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు గురువారం అంబరాన్ని అంటాయి. ఈ సంబరాలకు డీఈవో షేక్ సలీమ్ బాషా, స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆద్యంతం వీక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. రాజరాజేశ్వరి, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాఠశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి ప్రతి ఈవెంట్‌ను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కత్తులు లేని కోడి పందాలను ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. పాఠశాల విద్యార్థినిలు ప్రదర్శించిన సంక్రాంతి సంప్రదాయ పిండి వంటల ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రభల తీర్థం, కోడి పందేలను నిర్వహించారు. భోగి మంటలు, సంప్రదాయ దుస్తుల ప్రదర్శన, గొబ్బెమ్మలు, ముత్యాల ముగ్గులు, సోదమ్మ, హరిదాసు, గంగిరెద్దులు ఇలా సంక్రాంతి సంబరాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని విద్యార్థులు ప్రదర్శించారు.

విద్యార్థులు పాఠశాలల్లో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా సరదాలతో కేరింతలు కొట్టారు. పట్టణంలోని కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల, స్థానిక సర్ సీవీ రామన్ స్కూలులో జరిగిన సంక్రాంతి సంబరాలు పండగ శోభ ముందే ఆవిష్కరించినట్లు అయింది. కొంకాపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ పర్యవేక్షణలో సంబరాలు జరిగాయి. స్థానిక సీవీ రామన్ స్కూలులో విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులు ధరించి సంబరాలను హోరెత్తించారు. స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు పర్యవేక్షణలో జరిగిన ఈ సంబరాలకు కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, అలనాటి లవకుశ సినిమాలోని కుశుడు పాత్రధారి వియ్యూరి నాగ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకుడు సూదా గణపతి తదితరులు అతిథులుగా పాల్గొని సంబరాలను ఆద్యంతం వీక్షించారు.

అమలాపురం రూరల్: సాకుర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలను సర్పంచ్ గుత్తుల చిరంజీవి, వైస్ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణ, పాలమూరి ధర్మాపాల్ భోగి మంటలు వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులు హరిదాసు, పిట్టలదొర గంగిరెద్దుల ప్రదర్శనలతో అలరించారు. పాఠశాల చైర్మన్ పి.గంగాధరరావు, హెచ్‌ఎం జీఎంవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు కె.కిషోర్‌లు విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈదరపల్లి ఆర్ ఆర్ నగర్ ఎంపీపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముత్యాల ముగ్గులు, వివిధ రకాల వస్త్రధారణలో విద్యార్థులు సందడి చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె నాగశ్రీ,, సహ ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

అల్లవరం: గోడిలంక భవిత కేంద్రంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు టి.శ్రీను ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో పిల్లలు పాల్గొని సంబరాలను జరుపుకున్నారు. బండిగుప్తాపు పాండురంగ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ చాటిన దివ్యాంగులకు బహుమతులు అందించారు.

యానాం: పట్టణ పరిధిలో పలు పాఠశాలలో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక అయ్యన్ననగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆకట్టుకున్నాయి. రీజెన్సీ హైస్కూల్‌లో చిన్నారులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైద్యుడు డాక్టర్ కృష్ణ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. యానాం సబ్‌కోర్టులో సంక్రాంతి సంబరాలను న్యాయవాదుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలాది దుర్గా శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది విజయకుమార్, పేర్ని ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని ఆయా పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు రంగురంగుల సంప్రదాయ దుస్తులతో అలరించారు. విద్యార్థినిలు ముగ్గుల పోటీలలో పాల్గొని రంగవల్లులు వేశారు.


యానాంలో సంప్రదాయ వస్త్రాలతో వేడుకలకు హాజరైన చిన్నారులు


సాకుర్రులో విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు

సంక్రాంతి సంతోషానికి సంకేతం

సాయి దత్త నాగానంద సరస్వతీ స్వామీజీ


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సాయిదత్త నాగానంద సరస్వతీ స్వామీజీ

అమలాపురం టౌన్: మనిషిలోని సర్వ సంతోషాలకు సంక్రాంతి సంకేతంగా నిలిచి మానవాళిలో కొత్త ఉషస్సులకు నాంది పలుకుతుందని పశ్చిమ గోదావరి జిల్లా శృంగవృక్షం దత్త పీఠాధిపతి సాయి దత్త నాగానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. స్థానిక సూర్యనగర్‌లో రాయుడు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కోనసీమ సంక్రాంతి సంబరాలకు పీఠాధిపతి సరస్వతీ స్వామీజీ విశిష్ట అతిథిగా విచ్చేసి ఉపన్యసించారు. ఆధ్యాత్మిక సదస్సులో స్వామీజీ ప్రవచనాలు చెప్పారు. అంతకు ముందు సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోనసీమ స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. రంగువల్లులను పీఠాధిపతి వీక్షించారు. ఈ నెల 12న జరిగే స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల పేరిట ముద్రితమైన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్వామీజీ ఆవిష్కరించారు. రాయుడు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమలాపురం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కోనసీమ జేఏసీ ప్రతినిధి కరాటం ప్రవీణ్, హైకోర్టు న్యాయవాది ముషిణి రామకృష్ణారావు, ధార్మిక సంస్థల నాయకులు శిరంగు నాయుడు, జి.ధనరాజు తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం కొంకాపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో భోగి మంటను తిలకిస్తున్న విద్యార్థులు


అమలాపురం జెడ్పీ బాలుర పాఠశాల విద్యార్థినుల పిండి వంటల ప్రదర్శనను తిలకిస్తున్న డీఈవో బాషా తదితరులు


అమలాపురం సర్ సీవీ రామన్ పాఠశాలలో నిర్వహించిన ప్రభల తీర్థం, విద్యార్థుల సంప్రదాయ ప్రదర్శనలు


ఈదరపల్లిలో భోగి మంటల సందడిలో విద్యార్థులు